# భిన్న ధ్రువాలు



ఏమైనా కామాక్షే అనుకోవాలి. ట్రాన్స్ఫర్ అయి ఈ ఊరికి ఈ కొత్త ఆఫీసరు రాక పోయినా, ఒక్క గోపాలాన్నీ విశ్వనాథాన్నీ ఓ కంట కనిపెట్టకపోయినా, కనిపెట్టి ఇద్దర్నీ కలిపి ఉమ్మడిగా చివాట్లు పెడుతూ ఉండక పోయినా, వాళ్ళ ప్రాణానికో చిన్న సైజు

హిరణ్యాక్షుడిలా, రోజూ కనిపించక పోయినా, ఇందులో ఏ ఒక్కటి జరక్కపోయినా, గోపాలం విశ్వనాథంలు ఇంత ప్రాణమిత్రులు అయి ఉండక పోదురు. వాళ్ళ ఇద్దర్నీ ఇంత సన్నిహితంగా చేసిన పుణ్యం, గౌరవం కూడా పూర్తిగా ఆఫీసరు గారిదే!

లేకపోతే వీళ్ళిద్దరూ ఇంతక్రితం మొహం మొహం చూసుకుని ఎరుగుదురూ?... ఒకే ఆఫీసులో పనిచేస్తున్నా గోపాలం లోకం, గోపాలానిది - విశ్వనాథం ప్రపంచం, విశ్వనాథానిది. ఒకడు పరమ సాత్త్వికుడూ, ఇంకోడు పైలాపచ్చీసు. ఒకడుమహాభయస్థుడూ, దానికి తోడు గృహస్థుడూను. మరోడు నిర్లక్ష్యాన్నే లక్ష్యంగా పెట్టుకొన్న ఘోటకబ్రహ్మచారి. గోపాలం ఒకరి జోలికి పొంతికిపోడు. విశ్వనాథానికి ఊళ్ళో గొడవలన్నీ తనకే కావాలి. అధికారులు ఏవనుకుని పోతారో లభించడంతో, ఆఫీసు వదలగానే వాళ్ళిద్దరికీ ఎంతో సామగ్రి ఉండేది. ముచ్చటించుకోడానికి - ఒక్కొక్క మాటు ఆఫీసరుమీద అప్యాయంతో వాళ్ళు వల్లించే అష్టోత్తరం అర్ధరాత్రికికూడా అయిపోయేది కాదు అందువల్ల మర్నాడు పొద్దుటే విశేషంగా అందుకోవలసి వచ్చేది. కొన్నాళ్ళుచూసి ఇదేం బాగోలేదని, గోపాలం, తన సామానుని ఎలాగో అలాగ తక్కిన రెండు గదుల్లోకి సర్దుకుని, విశ్వనాథానికి మిగిలిన తన పెద్దగదిలోనే విడిది ఏర్పాటు చేశాడు. దాంతో వాళ్ళకి పుష్కలంగా టైము దొరికింది, ఆఫీసర్ మీద ఉన్న అభిమానాన్ని కసిదీరా వెళ్ళగక్కుకోడానికి.

ఆఫీసర్కి విశ్వనాథ్ బహూకరించిన ప్రతీ కొత్త బిరుదుకీ, గోపాలం దగ్గరనుంచి ఓమంచి కాఫీయో, హోటల్ భోజనంలోకి ఇంత ఊరగాయో లభించేది. ఒక్కోరోజున ఆఫీసర్

**పోలాప్రగడ సత్యనారాయణమూర్తి**

అని గోపాలం మూటనాలుగు డిగ్రీల జ్వరంలో కూడా ఆఫీసుకి వెళితే, అవసరం లేకపోయినా ఆఖరి క్యాజువల్ లీవుకూడా వాడుకుంటేగాని నిద్రపట్టదు విశ్వనాథానికి. జీతాన్ని జాగ్రత్తగా నెలంతా వాడుకుంటూ, బుద్ధిమంతుడిలా, పంచెకట్టూ అంటకత్తెర జుట్టూ వీటితో గోపాలం కాలక్షేపం చేస్తే, వచ్చిన జీతాన్ని ఒకటో తారీఖునే టెర్లిన్ షర్టులలోకి, కాన్పూర్ చెప్పల్స్ లోకి మార్చేసి, మర్నాటినుంచీ క్రాపింగ్ ఎగరేసుకుంటూ కనిపించిన ప్రతివాడి దగ్గరా, చేబదుళ్ళకోసం చెయ్యిచాపుతాడు విశ్వనాథం.

ఇలాంటి ఓ అంటకత్తెర జుట్టునీ ఇంకో బిరుసు క్రాపింగునీ దగ్గరగా తీసుకు రావడం ఎంతో కష్టం - అలాంటిది కష్టపడి తీసుకు వచ్చారంటే ఆ ఘనత అంతా ఆఫీసరుదే! గోపాలం మందకొడితనాన్ని, విశ్వనాథం తొందరపాటునీ ఒకలాగే సత్కరించసాగారు ఆఫీసరు. రోజూ ఎందుకో ఒకందుకు ఇద్దరికీ ఆఫీసరుగారి దీవెనలు తప్పకుండా మీదకి మరీ దురుసుగా కనక బండినిపోనిస్తే ఆరోజున గోపాలం ఇంట్లో ఆతిథ్యమేదొరికేది విశ్వనాథ్‌కి. ఈ విధంగా వాళ్ళిద్దరూ ఆఫీసులో ఉన్న ఆ అయిదారు గంటలూ తప్పించి తక్కిన రోజంతా, ఒకళ్ళని ఒదిలి ఒకరు ఉండకుండా, ఇంచక్కా ఆఫీసర్ మీద జోక్స్ విసురుకుంటూ నవ్వుకుంటూ ఆదర్శమైన మైత్రికీ అపురూపమైన ఉదాహరణంగా ఉండసాగరు.

ఇలా ఉండగా ఆ రోజున గోపాలం భోజనం చేసి బట్టలు వేసుకొని విశ్వనాధ్ కోసం చూసేసరికి, అతని దగ్గర ఆఫీసుకి బయల్దేరే చిహ్నాలేం కనిపించలేదు. గంటక్రితం తను స్నానానికని బయల్దేరినప్పుడెల్లా ఉన్నాడో ఇప్పుడూఅల్లాగే ఉన్నాడు. గెడ్డంగీసుకోకుండా, గూడకట్టుపంచెతో మడతమంచం మీద పడుకుని గాలిలోకి రింగురింగులుగా సిగరెట్ పొగవదుల్తూ ఆలోచిస్తున్నాడు. టైమ్‌చూస్తే తొమ్మిదిన్నర దాటుతోంది ఆలోచనల్లోపడి ఆఫీసు సంగతి మరిచి పోయినట్లున్నాడు.

"ఏమోయ్! విశ్వనాథ్! లే-ఇంకా అలా పడుకున్నావేమిటి? ఆఫీసుకి టైము అవుతోంది. [illegible] ఆలస్యం అయితే అవతల నరకాసురుడు ఏడుస్తాడు" అన్నాడు గోపాలం.

వాళ్ళిద్దరి భాషలోనూ నరకాసురుడంటే ఆఫీసరు అని. ఏడుస్తాడంటే తిడతాడనీ అర్థం. గోపాలం హెచ్చరిక విన్నా కూడా విశ్వనాద్‌లో చలనం కలగలేదు. కాస్సేపు విశ్వనాధ్ వేపు విస్తుపోయి చూసి గోపాలం మళ్ళీ హెచ్చరిక చేశాడు. ఈ సారి విశ్వనాథ్ కొద్దిగా కదిలి. కళ్ళతో గోపాలాన్ని పక్కలోకి రమ్మని సంజ్ఞచేసి, దిండు క్రింద పెట్టి ఉన్న లీవు లెటర్ని అతనికి అందించాడు.

"ఈ నెలలోనూ ఏం వచ్చింది నీకు?" అంటూనే. ఆ లీవు చీటీ అందుకుని నాలుగు పంక్తులూ చదివి "ఓరి నీ అసాధ్యం కూలా!... వంట చేసుకుంటుంటే గంజిపడి నీ కుడిచెయ్యి కాలిందీ!... నిక్షేపంలా ఉంటేనూ-ఏమిటిది?" అన్నాడు గోపాలం.

"అది అంతేలే!" అన్నాడు నిర్లక్ష్యంగా విశ్వనాథ్.

"ఇవ్వాళ మార్చి ఆఖరివారం కదా?... ఈ రిటరన్స్ హడాహుడిలో నీకు లీవు గ్రాంట్ చేస్తాడా?"

"అందుకే కాదుటోయ్ చెయ్యి కాలిందని పెట్టాను? అందులోనూ కుడిచెయ్యి! ఎన్ని ఆలోచించి ఇలా పెట్టాననుకున్నావ్?"

"పెట్టావ య్యా!"...బాగానే ఉంది - ఆ హిరణ్యాక్షుడు గ్రాంట్ చెయ్యొద్దూ"

"నిక్షేపంలా చేస్తాడు. అది అంతా, నువ్వు చెప్పడంమీద ఆధారపడి ఉంటుంది. నువ్వొకవక జాగ్రత్తగా వర్ణించి, చాలా ప్రమాదం జరిగిందన్నట్లూ ఇంకొంచెం ఉంటే ఒళ్ళంతా కాలిపోవును అన్నట్లూ తెలివిగా చెప్పావంటే మహా చక్కగా గ్రాంటు చేస్తాడు..."

"ఏవిటో! నాకి అబద్ధాలు చెప్పడం అట్టే అలవాటు లేదు..."

"అలాగని తడబడ్డావు సుమా! కొంప దీసేస్తావు - వాడసలే అసాధ్యుడు - అవలిస్తే పేగులు లెఖ్ఖపెడతాడు..."

అసలు ఎందుకొచ్చిన తంటాలు ఇవన్నీ? శుభ్రంగా ఆఫీసుకి వచ్చేయ్యకూడదూ!"

"పిల్లలకే కాదుటోయ్ ఇదంతా."



"ఏమిటి వీల్లేనిది? ...! నీ కిప్పుడు వచ్చిన మహా ప్రమాదం ఏవిటి?"

"ప్రమాదమే! ..."

"ఏమిటో అది? ... చెప్పకూడదా?"

"అబ్బే - చెప్పక పోవడానికి నీ దగ్గర దాపరికం ఏముంది - నేను తరుచు చెపుతూ ఉంటాను లలిత అని-ఆ అమ్మాయి లేదూ?... వాళ్ళ నాన్న, ఇవాళ ఏదో ఒక సంబంధం రైటు చేసెయ్యాలనుకుంటున్నాడట! అందువల్ల నన్ను వచ్చి వాళ్ళ నాన్నతో మాట్లాడమనీ, లేకపోతే ఆనక ఇద్దరం విచారించాల్సి వస్తుందనీ, ఓ కుర్రాడి ద్వారా ఆమె చీటీరాసి పంపించింది."

"ఇప్పుడక్కడికి వెళ్ళి ఆ పెళ్ళిప్రయత్నమేదో రైటుచేసుకుని రావాలన్నమాట!"

"సరే-కానియ్యి..." అంటూ లేచాడు గోపాలం.

"నువ్వు జాగ్రత్తగా చెప్పాలి సుమా! ఇవాళ్టికి నువ్వెల్లాగో గట్టెక్కించావంటే, రేపటి సంగతి నేను చూసుకుంటాను" అన్నాడు విశ్వనాథ్...

"ఏం చూసుకుంటావో ఏమో" అని, నసుగుతూ, అయిష్టంగా అడుగు కదిపాడు గోపాలం.

* * *

ఆరోజే కాకుండా ఆ మర్నాడు, దగ్గర దగ్గర పదింటివాకా కూడా విశ్వనాథ్ రూమ్‌కి తిరిగి రాలేదు. కాలు గలిన పిల్లిలాగా వీధిలోకీ ఇంట్లోకీ తిరిగి ఇబ్బంది పడుతున్నాడు గోపాలం. బయటికివచ్చి చూసినప్పుడల్లా, విశ్వనాథ్ రూమ్‌కి వేసిఉన్న తాళంకప్ప అతనికేసి చూసి మౌనంగా గేలిచేస్తున్నట్లు అనిపించి విసుక్కోసాగాడు. ఇంకా రాడేమిటీ?... ఏమైపోయాడు. ఆ కాబోయే మావగారితోటి ఇంకా రాచకార్యాలు పూర్తిఅవలేదేవిటి? ఇవతల కొంపలు మునిగిపోతూంటే?... ఇరవైనాలుగు గంటలసేపు అక్కడ ఏం వెలగబెడుతున్నట్లు?... బహుశా సంప్రతింపుల కోసం వాళ్ళ ఊరు వెళ్ళాడేమో!... వెళితే మాత్రం ఈపాటికి అఘోరించవద్దూ!... బస్‌స్టేడ్ నుంచి అలా ఆఫీసుకి వచ్చేద్దాం అనుకోలేదుకదా కొంపతీసి? ఈ ఆలోచనలో భయంవేసి గోపాలానికి ఒళ్ళంతా ఒక్కసారి ఒణికి పోయింది... దాంతో అతనికి నిన్న జరిగినదంతా మనస్సులో సినిమా రీలులా తిరిగింది....

విశ్వనాథం ఇచ్చిన లీవుని ఆఫీసరుకి నిన్న తను అందజేశాక ఆయన దానిని పూర్తిగా చదువుకొని తనని నఖశిఖ పర్యంతరం ఓమారు పరిశీలనగా చూశాడు. తనకి ఆ చూపులు కొంచెం ఇబ్బందిని కలిగించాయి. అలా కొంతసేపు పరీక్షగా చూసి "ఈ లీవు నీకు ఎవరు ఇచ్చారు?" అన్నాడు ఆఫీసర్.

కొంచెం బెదురుతూ "అతనే!" అన్నాడు అతను.

"ఇంతకీ అతనికి కాలిన చెయ్యి, కుడా ఎడమా?"

"కుడిచెయ్యేనండి - వేళ్ళూ అరచెయ్యీ పూర్తిగా బొబ్బలెక్కి పోయాయండి ఆఫీసుకి వచ్చినా ఏం రాయలేడు."

"ఆహా! ... అంతకాలిపోయినా లీవు లెటర్ మాత్రం రాయగలిగాడన్నమాట!" అన్నారు తలపంకిస్తూ - కొంపతీశాడు - విశ్వనాథ్ ఎంత తెలివి తక్కువ పనిచేశాడు? తనకి గుండెల్లో రాయిపడింది. ఈయన నన్ను క్రాస్ ఎక్జామిన్ చేసి మొత్తానికి తన చేత నిజం కక్కించడు కదా అనుకున్నాడు - దాంతో గొంతులో ఒణుకూ, మాటలో తడబాటూ వచ్చింది- వీటిఅన్నిటితోపాటూ విశ్వనాథ్ తెలివి తక్కువ మీద పట్టలేనంతకోపం కూడా వచ్చింది... ఎంత పనిచేశాడు?... కుడి చెయ్యి అని అఘోరించకపోతే ఎడం చెయ్యి అని ఏడవకూడదూ?... ఈ తెలివి తక్కువవల్ల తను ఇరకాటంలో పడడమే కాకుండా నన్ను కూడా ఇబ్బందిలో పెట్టేలాగా ఉన్నాడు-తనకి ఎలాగా తప్పదు. నాకెందుకీ గోల? ... అంతగవస్తే నిజం చెప్పేస్తాను ... విశ్వనాథ్ విషయం అంటావ్?...తర్వాత చూసుకోవచ్చు

ఇలా తనోనిర్ణయానికి వచ్చాక ఆఫీసర్ ముఖంలోకి ధైర్యంగా చూడగలిగాడు- తన కళ్ళల్లోకి తీక్షణంగా చూస్తూ "అతని చెయ్యి

...ంకుకు కాలినట్లు ఇంతకీ?" అన్నారు ఆఫీసర్...

తను కొంచెం బెరుకుగా "గంజిటాండి... అన్నం వండుకొనేటప్పుడు..." అంటూ టెలిగ్రాఫిక్ భాషలో మాటలు తుంచేస్తూ అన్నాడు.

"రోజూ అన్నం అతనే వండుకుంటాడేమిటి".

తనకి నక్కా చావు వచ్చింది మధ్యన. ఇట్లాంటి ఇరకాటంలో తనని పెట్టి, ఇంచక్కా అక్కడ మామగారి ఇంట్లో ఈ పాటికి పెళ్ళికబుర్లు చెబుతూ కులుకుతూ కూచున్న విశ్వనాధ్ మీద ఒళ్ళు మండింది...

"ఏవయ్యా-మాట్లాడవేం!...విశ్వనాధ్ చేతిమీద ఇవాళ గంజి ఒలకడానికి కారణం ఏమిటి? అతనికి అలవాటు లేకనా?"


"చిత్తం...రోజూ వండుకోడం అలవాటు లేదండి"

"మరి భోజనం?"

"హోటల్లో చేస్తాడు."

"ఓహో! రోజూ వండుకోనివాడు ఇవాళ ఈ క్యాజుయల్ లీవుకోసం..." అంటూన్న ఆఫీసరు దగ్గర ఇంకా నిజాన్ని దాచి లాభంలేదని గ్రహించి ఓ ప్రక్కనుంచీ భయపడుతూనే చెప్పేశాడు అసలు సంగతి అంతా. అతను చెప్పింది అంతా శ్రద్ధగా విని తల ఊపి "అది అలా చెప్పు సర్లే వెళ్ళు" అన్నారు ఆఫీసరు. బ్రతుకు జీవుడా అని ఇవతలపడ్డ తనకి, మళ్ళా విశ్వనాధ్ భయం పట్టుకొంది. ఇల్లా నిజం చెప్పేశావని ఏం కోపగించుకుంటాడో: కోపగించుకొంటే కోపగించుకున్నాడు....ఏం- చావనా మరి? చెప్పకపోతే ఈయనతో తంటా - ఇలా జరిగిందంతా చెప్పేస్తే కాని కుదరలేదు - అనక అంటావ్! తన తంటాలు తను పడతాడు...

ఇలా ఆలోచించి సాయంత్రం తను ఆఫీసు నుంచి ఇంటికి వస్తే, ఇంకా రాలేదు ఈ విశ్వనాధం, సాయంత్రం - రాత్రి తెల్లవారిన తర్వాతే ఇప్పటిదాకా చూశాడు తను. ఇంకా పదికి పదినిముషాలు మాత్రం వ్యవధి ఉంది-



ఇంకా ఏడవకపోతే నేనెక్కడ ఏడ్చేది?... అతని ఖర్మ ఎలావుంటే అలా అవుతుంది.

ఇలా అనుకొని ఆఫీసుకని బయలుదేరాడు. చివరికి గోపాలం-ఆఫీసులోకి అడుగుపెట్టేటప్పటికి తను ఏదైతే భయపడుతూ వచ్చాడో అదే జరుగుతోంది. కుడిచేతినిండా వేసులేన్, దూదీ, వాడూను, బస్ దిగి తిన్నగా ఆఫీసుకి వచ్చేసినట్టున్నాడు. ఇప్పుడీ విశ్వనాధ్‌కి తాను నిన్నటి సంగతి సూచించడం ఎలా? లేకపోతే ఈ "చెయ్యీ-గంజీ" కథ ఆయన దగ్గర ఏ కరువుపెడతాడేమోకర్మం. ఎలా?... ఏవిటి చెయ్యడం! ఇలా తొట్రుపడుతూ నాలుగడుగులు వేసేటప్పటికి కనిపించారు. ఆఫీసరుగారుకూడా ఏదో ప్రశ్నలు అడుగుతున్నారు-మనవాడేదో సమాధానాలు చెప్పుతున్నాడు-ఎల్లాగేనా నిన్న జరిగిన సంగతిని సంజ్ఞచేసిచెప్పి, విశ్వనాధాన్ని ఆ ప్రమాదంనుంచి తప్పించాలని మహా ప్రయత్నంచేశాడు గోపాలం-కాని అతనిటు చూడ్డే! అతని మాటలు అలాఉంచి, ఆఫీసరు చూసేశారు, తనుపడుతున్న తాపత్రయాన్ని-అందుకే అన్నారు...

"రా-గోపాలం; విశ్వనాధ్ ఏం చెపుతున్నాడో విను...ఊ...కానియ్యావోయ్ విశ్వనాధం" అన్నారు...

"నిజం అండీ...ఇంకొంచెం ఉంటే ఒళ్ళంతా కాలిపోయి ఉండును...గోపాలం కూడా చూశాడు...తమకి అంతగా అనుమానం అయితే ఇంకా ఈ చెయ్యి..."అంటూ బాగా వేసులైన్ పట్టించి కాలినదానిలా తయారు చేసిన చెయ్యి, ఆ నకి చూపించాడు విశ్వనాధం.

గోపాలాని ముచ్చెమటలూ పోశాయి.

ఆఫీసర్‌గారు ఒంగుని పరిశీలించి "చాలా చిత్రంగా కాలిందయ్యా-ఇలాంటిది, నేనింత క్రితం ఎక్కడా చూడలేదు" అన్నారు గంభీరంగా.

ఆయన దింపుతున్న గోతులోకి చల్లగా దిగిపోతున్నాడే విశ్వనాధ్ అనే ఆలోచనతో గుబులు ఎక్కిపోసాగింది గోపాలానికి-

"నువ్వుకూడా చూడు గోపాలం! చాలా పెద్ద ప్రమాదం తప్పింది కదూ?" అన్నారు ఆఫీసరు, గోపాలం సమాధానం ఏం చెప్పకుండా గుటకలు మింగి బిత్తర చూపులు చూడసాగాడు...

"ఏం గోపాలం మాట్లాడవేం?... నీ దృష్టిలో ఇది బాగా కాలినట్లుకాదా!" అన్నారు ఆఫీసరు గట్టిగా. విశ్వనాధం కొరకొరా గోపాలంకేసి చూశాడు "ఇంత మంచి అవకాశం ఆయన ఇస్తే నువ్వు ఇంకా నీళ్ళు నములుతావేమిటి! గబగబా గోరంతలు కొండంతలుగా చేసి కాలిన చెయ్యిగురించి వర్ణించకుండా..." అన్నట్లుంది ఆ చూపు...

గోపాలం పని, మధ్యన ఇరకాటం అయిపోతోంది. మళ్ళా ఆఫీసరుగారు ప్రశ్నించడం. విశ్వనాధ్ విషయంలో బాధని అనుభవిస్తూ చెప్పడం. కొంచెంసేపు ఇల్లా ఏడిపించి ఆఖరికి నవ్వుతూ అన్నారు ఆఫీసరు "సరేలే-బాగానే ఉంది-నీ చెయ్యికాలడం నవ్వాను-ఇంకెందుకులే-ఆ చేతినున్న వ్యాసులైనూ మందూ బాగా తుడిచేసుకునిరా-ఆ లీవు లెటర్‌లో" చెయ్యికాలడం వల్ల "అనే కారణాన్ని కొట్టేసి" పెళ్ళి ప్రయత్నానికి వెళ్ళడం వల్ల "అని మార్చుదువు గాని" అంటూ వెళ్ళిపోయారు.

ఆ మాటలు విని విశ్వనాధ్ తొట్రుపడి ఏదో చెప్పబోయాడు. అప్పటికే ఆఫీసరు వెళ్ళిపోయాడు-ఆయన వెళ్ళిపోయిన దిక్కే వెర్రిగా చూస్తూ కొంచెంసేపు అలాగే నిలబడి వెంటనే కోపంగా మొహం అటు గోపాలంవేపుతిప్పాడు విశ్వనాధం - గోపాలం భయంతో వణికిపోతూ బుర్రవంచుకొని నేలకేసి చూడసాగాడు...

కొంతసేపయాక "ఏం చెప్పావు నిన్న ఆఫీసరుకి? ...ఏం మాట్లాడవేం!" హుంకరించాడు విశ్వనాధ్.

"ఏం చెయ్యను మరి; ... నిజం చెప్పేదాకా ప్రాణాలు తీశాడు".

"నిజం చెప్పి ఇప్పుడు నా ప్రాణాలు తీశావు".

గోపాలం ఏం సమాధానం చెప్పలేదు.

"తమరు నిన్నచేసిన ఈ ఘనకార్యాన్ని నాకు ముందుచెప్తే, ఈ చెయ్యీ మందుతో

ఇలా వచ్చి అవహాస్యం పాలవతుండా ఉండునా?"

"ఏదీ-నువ్వేమో రూమ్‌కి రాకుండా తిన్నగా ఆఫీసుకేవచ్చేశావు. ఇంక నేను నీకుచెప్పడానికి అవకాశం ఏదీ?"

"రాకపోతే ఏం చెయ్యను? టైమయిపోయింది. అదీకాక తమరు ఇలా వెలగబెడతారని నేనేం కలగన్నానా?"

"నేను మాత్రం నువ్విలా ఆఫీసరుగారి దగ్గరికి వచ్చి పడిపోతావని ఊహించానా?"

"ఏమైతేనేం? నీ స్నేహం చేసినందుకు, నవ్వినవాళ్లో పెద్ద ఫూల్‌నిచేసి వదిలేవు ఆఫీసరు ముందు"

"నువ్వు మాత్రం?"

"చాలుదాల్లే?...నీలాంటిపెసరపప్పుగాడితో స్నేహం చెయ్యడం నాదే బుద్ధి పొరబాటు"

"ఆ మాటకొస్తే నీలాంటి అబద్ధాలకోరుతో స్నేహం చెయ్యడం నాదే ఎక్కువ బుద్ధి పొరబాటు"

"ఏమైనా నేను చాలా తెలివితక్కువ పని చేశాను"

"నేనే నీకంటే ఎక్కువ తెలివి తక్కువ వాడినే, నీలాంటి వాడి స్నేహం చేసినందుకు"

"సర్లే- ఇంకివాళనుంచి నాతో మాట్లాడకు నాకు ఒళ్ళు రవులుకు పోతోంది."-

"నాకూ మండిపోతోంది ఒళ్ళు. నిన్ను చూస్తుంటే"

"షటప్"

"యూ షటప్"

ఇల్లా ఆఫీసులోనే జుట్టూ జుట్టూ పట్టుకోబోయిన గోపాలం, విశ్వనాథాల్ని తోటి గుమాస్తాలు విడదీశారు -

ఇలా వాళ్ళిద్దరూ ఇవాళ దెబ్బలాడుకొని ఒకళ్ళకొకళ్ళు బద్ధ విరోధులు అయిపోవడం ఏమిటి; ఆ మర్నాడు ఆఫీసరుగారికి, ఆ ఊరు నుంచి బదిలీ ఆర్డర్లు రావడం ఏమిటి రెండూ చిత్రంగానే జరిగిపోయాయి వెంట వెంటనే - అంతా అనుకున్నారు గూకుమ్మడిగా సమావేశమై; ఏ మాట కామాటే అనుకోవాలి- వీళ్ళ మైత్రికి ఆఫీసరు గారే కారణం, మళ్ళీ వీళ్ళ



విరోధానికి కూడా పాపం ఆయనే కారణం" అని -

అందులో ఒక గుమస్తా అన్నాడు.

"ఆయనీఊరువచ్చి వీళ్ళకి స్నేహం చేశారు- మళ్ళీ వెళ్ళిపోతూ వీళ్ళని విడదీసెయ్యవద్దూ? అని-" ఆ-మళ్ళీ మనకి ఈరోజు నుంచి కావలసినంత సందడి, గోపాలం, విశ్వనాథుల గొడవలతో" ఇది ఇంకో గుమాస్తా పడిన సంతోషం- ఆ తర్వాత ఓ సుముహూర్తాన గోపాలం విశ్వనాథ్‌చేత గదిని ఖాళీచేయించేశాక, విశ్వనాథ్ తన సీటుని మార్చుకుని గోపాలం వేపు వీపు పెట్టుకొని కూర్చోసాగాడు.

ఇవాళ వాళ్ళిద్దరి మధ్యా మళ్ళీ పచ్చగడి వేస్తే భగ్గుమంటోంది అంటే, అది ఆఫీసరు గారి ధర్మమే మరి!

ఇంతకీ ఆయన మాత్రం ఏం చెయ్యగలడు? గోపాలం ఓ ధ్రువం, విశ్వనాథ్ ఇంకో ధ్రువమూను- ఈ భిన్నధ్రువాల్ని ఏ శక్తి తాత్కాలికంగా ఏకం చేసినా, అవిమాత్రం చివరికి భిన్నధ్రువాలుగానే మిగిలిపోతాయి. వాటి మధ్యనున్న ఆఫీసర్‌లాంటి మేగ్నటిక్ మెరిడియన్‌లు మాత్రం ఇవాళ ఉండొచ్చు రేపు పోవచ్చు కాని ఆ రెండు అయస్కాంత భిన్నధ్రువాలూ మాత్రం ఆకర్షణకి ఎంత అవకాశం ఉన్నా ఎప్పుడూ ఎడమొహం పెడ మొహంగా నికర్షణలోనే ఉండి పోతాయి.

★